డా ఉపాధ్యాయుల కృష్ణమూర్తి.

- హైదరాబాదు






అమ్మ నిజం అయితే, నాన్న నమ్మకం. ఆ నమ్మకాన్ని బలంగా మాలో నింపుకున్న వ్యక్తి మా నాన్నగారు. పేరుకి అతను భద్రాద్రి రాముడు, కాని మాకు మాత్రం నిజంగా దేముడు. మంచితనం, అమాయకత్వం, మానవత్వం, జాలి, కరుణ, ఉపకారగుణం, క్షమాగుణం, ఓర్పు, పసితనం - ఇన్ని గుణాలు కలిపి చేసిన వ్యక్తి మా నాన్నగారు.

కోనసీమలో రాజమండ్రి జిల్లా, రాజోలు తాలూకాలోని ఆదురు అనే గ్రామంలో 1916 లో జన్మించారు. ఐదుగురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్ల కుటుంబానికి పెద్దగా పుట్టారు. స్కూలు ఫైనలు తరువాత 1943-44 లో హైదరాబాదు వచ్చేసారు. స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగంలో చేరారు. ఆయనకి మొదటి నుండీ, చదువుకోవాలన్నా, పెద్ద చదువులు చదివిన వారన్నా చాలా ఇష్టం, గౌరవం. వయస్సు, ఉద్యోగం చదువుకోవడానికి అడ్డుకాదని, అడ్డు రావని ఆయన ఆనాడే నమ్మారు. ఆచరించారు. ఈవినింగ్ కాలేజీలో చేరి FA,BA పూర్తి చేసారు. నాగపూరు వెళ్ళి M.A(lit) చేసారు. L.L.b. పూర్తి చేసారు. టైప్, షార్ట్‌హాండ్ హైయ్యర్ పాసయ్యారు. ఉద్యోగంలో నీతిగా, నిజాయితీగా ఉన్నారు. చాలా మందికి కంటకంగా నిలిచారు. అందుకే ఆయనకి 3-4 సార్లు ప్రమోషన్ ఇవ్వలేదు. తక్కువ క్వాలిఫికేషన్ ఉన్న వారికి ఇచ్చారు. అయినా ఆయన తన నడవడిని మార్చుకోలేదు. Humiliations భరించలేక 1956లో రాజీనామా చేసారు. లాయరుగా ప్రాక్టీసు మొదలు పెట్టారు. అందులో అంతగా కలిసి రాలేదు. అయినా మమ్మల్నందరినీ చదివించారు. మేం నలుగురు అక్క చెల్లెళ్ళు, ఇద్దరు అన్నదమ్ములం. 1963లో నాకు M.B.B.Sలో సీటు వచ్చినప్పుడు ఎంత సంతోషించారో!. మన వాళ్ళలో మొదటి డాక్టరు అవుతావన్నారు.

ఊరునుండి ఇద్దరు తమ్ముళ్ళు వచ్చేస్తే, వారిని ఇంట్లో పెట్టుకుని చదివించారు. ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు తన వాటా అమ్మేసి చేసారు. 1969 లో నాకు డాక్టరుగా ప్రైమరీ హెల్త్ సెంటర్ లో ఉద్యోగం వచ్చింది. M.D రేడియోలజీలో హైదరాబాదులో సీటు కూడా వచ్చింది. ఇల్లు గడవడానికి ఉద్యోగంలో చేరడం చాలా అవసరం, ఏం చెయ్యనని నాన్నగారిని అడిగాను. M.Dలో చేరమని అన్నారు. ప్రోత్సహించారు. దగ్గరి వాళ్ళందరూ ఈ నిర్ణయాన్ని విమర్శించారు. అయినా ఆయన అభిప్రాయం మార్చుకోలేదు. ఆర్థికంగా చితికి ఉన్నా అభిప్రాయంలో ధృఢంగా నిలిచారు. ఆనాడు ఆ లేమిలో ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఉద్యోగంలో చేరి ఉంటే ఏదో జిల్లాలో వైద్యాధికారిగా ఉండి ఆర్.టీ.ఓ అయి ఉండేవాడిని. రేడియాలజిస్ట్‌ని అయి ఉండే వాడిని కాను. ఆయనకి పెద్ద చదువు మీద గౌరవం నన్నీనాడు నిలపెట్టింది. 1973లో లక్షమంది కార్మికులు పని చేసే ఆర్టీ.సీ లో రేడియోలజిస్ట్‌గా చేరాను. అది ఆయన సాధించిన విజయమే అంటాను. ఎంత ఆనంద పడ్డారో మాటల్లో చెప్పలేను. జాబ్‌లో చేరే ముందు నన్ను పిలిచి విధులు నెరవేర్చడంలో సిన్సియారిటీ, రెస్పాన్స్‌బిలిటీ, హ్యూమానిటీస్ - మూడూ మరచి పోవద్దన్నారు. అన్నం పెట్టే చెయ్యికి కృతజ్ఞతగా ఉండాలన్నారు. ఎదురు తిరగొద్దన్నారు. అందుకే నాకు రావలసిన ప్రమోషన్లు, జూనియర్ల కిచ్చినా, నైతికంగా ఆయన మాట్లకి కట్టు బడి నేను ప్రొటెస్ట్ చేయలేదు. ఉన్నప్పుడు కంటే, లేనప్పుడే నలుగురికీ సహాయం చేయాలనే వారు. డబ్బుకి దాస్యం చేయవద్దనే వారు. కాని హాస్యం కూడా చేయవద్దనే వారు. నేను ఈ రోజున ఆయన అడుగు జాడల్లోనే నడుస్తున్నాను. అందుకు చింతించను.

ఇంటిని నడపడం మా అమ్మ చూసుకునేది. నాన్నగారికి అవేమీ పట్టేవి కావు. కాని నేను చెయ్యలేను, అమ్మ మాత్రం చేయగలదు అని హానెస్ట్‌గా ఒప్పుకొనేవారు. చాలా సమయాల్లో ఓపెన్‌గా అమ్మకి క్రెడిట్ ఇచ్చేవారు ఎప్పుడూ మేల్ ఇగోకి పోలేదు.

1976 లో ఆయనకి కాన్సర్ వచ్చింది. ముక్కుపొడుం కూడా ఎరగని ఆయనకి ముక్కు వెనకాల కాన్సర్ వచ్చింది ట్రీట్‌మెంట్ అయినా కూడా చాలా బాధపడ్డారు.

1978 లో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా తరపున సైరియా అనే దేశానికి వెళ్ళే అవకాశం వచ్చింది. ఆయన ఆనందం పట్టరానంత, చెప్పలేనంత. 1979 లో నేనక్కడ ఉండగానే పోయారు. నేను దగ్గర ఉండలేకపోయాను. అది గోదావరీ పుష్కరాల టైం కాబట్టి, సెలవులకి వచ్చినప్పుడు రాజమండ్రి వెళ్ళి కర్మలు చేసాను.

ఆయన చాలా అల్ప సంతోషి. మనీ పర్సులు వాచీలు అంటే చాలా ఇష్టం. సైరియా లో ఉండగా ఆయన సిటిజన్ వాచీ తెమ్మన్నారు. కొన్నాను కాని ఆయనకి ఇవ్వలేక పోయాను. అందుకే ఆయన హాబీగా నేను వాచీలు కలెక్ట్ చేస్తున్నాను. నా దగ్గర ఇరవై వరకూ ఉన్నాయి,

నాన్నగారికి, రాజ్‌కపూర్ సినిమాలన్నా, డాన్స్ ఉన్న సినిమాలన్నా చాలా ఇష్టం. సంగీతం కూడా చాలా ఇష్టంగా వినేవారు. ఆయన మమ్మల్నెప్పుడూ కోప్పడలేదు, తిట్టలేదు, కొట్టలేదు. చదువుకోమనేవారు. అదే మనకి ఆయుధం అనేవారు.

చదువుకోవాలి, చాలా డిగ్రీలు పొందాలి అనే ఆయన కోరిక నాకూ వచ్చింది. అందుకే నేను సెంట్రల్ యూనివర్శిటీలో, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో డిప్లొమా తీసుకున్నాను. ఫ్రెంచ్ డిప్లొమా చేసాను.

నేను స్వతహాగా ఇంగ్లీష్, తెలుగులో కవితలు రాస్తాను. ఇంకా రాస్తున్నాను. తెలుగు, ఇంగ్లీషు M.A చేయాలనుకున్నాను కానీ చేయలేక పోయాను. కాకపోతే ఆ రెండుభాషలూ నాకు రెండు కళ్ళ లాంటివి.

మా ఆసుపత్రిలో కేన్సరు కేసులు చూడడానికి స్పెషలిస్ట్‌లు లేరు. సరి అయిన ఎడ్వయిజ్, ఫాలోఅప్ ఉండేవి కావు. అందుకే 1985లో మా నాన్నగారి మాటలు "స్వచ్ఛందంగా సహాయం చెయ్యి" అనే ఉదాత్తమైన ఆశయాన్ని మార్గదర్శకంగా తీసుకుని కేన్సరు కేసుల బాధ్యతన్ని తీసుకున్నాను. ఆ 8 ఏళ్ళు, ఆర్.టీ.ఓ అయ్యేవరకూ వాలంటరీ సేవ చేసాను. ఒక్క రూపాయి కూడా అడగలేదు. అలా చేస్తుండగా చాలా కష్టాలు, విమర్శలూ ఎదుర్కొన్నాను. మందుల కోసం యాజమాన్యంతో పోరాడ వలసి వచ్చేది. అయినా నిజాయితీగా, నిర్భయంగా నిలిచాను. నా సేవని యాజమాన్యం గుర్తించకపోయినా అన్ని కార్మిక సంఘాలు గుర్తించి పొగిడాయి. అందుకే 2003లో పదవీ విరమణ చేసినప్పుడు, అన్ని కార్మిక సంఘాలు నాకు నవరత్నాలు పొదిగిన ఉంగరం ఇచ్చి సన్మానం చేసారు. ఇప్పటి వరకూ ఆర్.టి.సి చరిత్రలో అటువంటి సన్మానం నా ఒక్కడికే చేసారు. అంత పెద్ద గౌరవం కేవలం మా నాన్నగారి మాటల వల్ల కలిగిన ప్రోత్సాహం, ప్రోద్బలమే.

ఆయనకి పెన్షన్ స్వయంగా వెళ్ళి తీసుకోవడం అలవాటు, సరదా. బాంక్‌కి మార్చుకోండి అని మేమంటే, కాదు నెలకొకసారి పాత స్నేహితులని కలిసి మంచీ చెడ్డా మాట్లాడుకోవచ్చు అనే వారు. చివర్లో ఆయనకి ఓపిక లేకపోయినా నేను కొన్ని సార్లు రిక్షాలో తీసుకెళ్ళాను. అక్కడ ఆయన అందరినీ పేరు పేరునా పలకరించేవారు.

ఆయనకి కిషన్ సింగ్ అనే స్నేహితుడు హిమాయిత్ నగర్ - హైదరాబాద్‌లో ఉండేవారు. ఆయనకి ఎకరం నేలలో పెద్ద ఇల్లు. వాళ్ళు రాజపుత్ర వంశం వారు. అతనింటికి వారానికి మూడు నాలుగు సార్లు వెళ్ళేవారు. ఒకసారి ఆయన ఇలా వచ్చే బదులు - ఈ ఆవరణలోనే ఇల్లు కట్టుకోరాదా! రోజూ చూసుకోవచ్చు అని అన్నారు. కాని మా నాన్నగారు ప్రలోభ పడలేదు. సున్నితంగా తిరస్కరించారు. స్నేహానికి ఎలాంటి విలువలు ఇవ్వాలో నేర్పించారు.

1974 లో నా వివాహం అయింది. మాది ప్రేమ వివాహం. మేం కోన సీమ ద్రావిడులం, వాళ్ళు శ్రీ వైష్ణవులు. మా విషయం చెప్పినప్పుడు నాన్నగారు కూల్‌గా ఉన్నారు. కోపంతో ఎగిరిపడలేదు. ఆ రోజుల్లో పైశాఖల్లో వివాహాలు విడ్డూరమే. చిన్నప్పటి నుండీ తెలిసిన అమ్మాయి కదా! మంచిదే అని అంగీకరించారు. అది వారి విశాల హృదయానికి, అర్థం చేసుకొనే మనస్తత్వానికి ఉదాహరణ.

ఆయన తలపులూ, జ్ఞాపకాలూ, మాటలూ, రూపం మా అందరిలో నిలిచే ఉంటాయి. ఆయనెప్పుడూ నాకు మార్గదర్శిగానే ఉన్నారు, హెచ్చరిస్తూనే ఉంటారు. పైనుంచీ దీవిస్తూనే ఉన్నారు. అటువంటి నాన్నగారికి కోటి జేజేలు.

డాక్టర్ కృష్ణమూర్తి గారు
హైదరాబాదులో చిరకాలం
రేడియాలజిస్ట్ గా పనిచేసి
రిటైరయ్యారు. చక్కటి భావకులు, కవి,
రచయిత.

అమ్మ వొడిలో పెరిగిన బాల్యం, నాన్న వీపు మీద ఊరేగిన చిన్నతనం గుర్తుందా?
మన చిన్నతనంలో అమ్మా, నాన్నా మనకి మొదటి గురువులు. మన వ్యక్తిత్వం
రూపొందడంలో అమ్మా, నాన్నల పాత్ర మరువలేనిది.. మీ నాన్న గారి జ్ఞాపకాల్ని
సుజనరంజని పాఠకులతో పంచుకోండి..చిన్నప్పుడు నాన్నగారు మిమ్మల్నెలా పెంచారు,
ఎలా గారాబం చేశారు, ఎలా దండించారు, ఎలా పాఠాలు నేర్పించారు, ఎలా మిమ్మల్నో
మనిషిగా తీర్చిదిద్దారు..అన్నీ రాయండి..
మీ నాన్నగారి ఫోటో కూడా కూడా జతచేయండి. మీ వివరాలు, ఫోటోలతో మీ
రచనలు ఈ శీర్షికకి పంపించండి.
ప్రతినెలా ఓ పాఠకుడి/ పాఠకురాలి నాన్న గారికి జేజేలు చెబుదాం.. !!